## క్లుప్తంగా

### నాగపంచమి ప్రత్యేక పూజలు



ఫిరంగిపురం: మండలంలోని పలుగ్రామాల్లో ఆలయాల్లో సోమవారం నాగపంచమిని పురస్కరించుకొని భక్తులు ప్రత్యేకపూజలు చేశారు. మండలకేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలోని పుట్టవద్ద, వేములూరిపాడులోని పుట్టవద్ద, 113 తాళ్లూరులోని శివాలయం వద్దనున్న పుట్టవద్ద భక్తులు పెద్ద ఎత్తున వచ్చి పుట్టలో పాలుపోసి, సజ్జలు, చలిపిండి నివేదనగా పెట్టారు.

### మద్యం సీసాలు ధ్వంసం

మేడికొండూరు: మండల పరిధిలో పలు కేసుల్లో పట్టుబడిన అక్రమ మద్యం సీసాలను మేడికొండూరు పోలీసులు సోమవారం ధ్వంసంచేశారు. మండల పరిధిలోని పేరేచర్ల – గుంటూరు బ్రాంచ్ కెనాల్ సమీపంలో సీఐ కె.వాసు సమక్షంలో 33 మద్యం బాటిళ్ల ధ్వంసం చేశారు. సీఐ వాసు మాట్లాడుతూ మండలంలోని పలు కేసుల్లో పట్టుబడ్డ మద్యం బాటిళ్లు పొక్లెయినర్‌తో ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. ఏఎస్ఐ శ్రీనివాసరాజు, కానిస్టేబుళ్లు సిద్దు, ఇమ్రాన్‌వలి పాల్గొన్నారు.

### విజయవాడకు తరలిన ఉద్యోగులు



ఫిరంగిపురం: విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సోమవారం నిర్వహించే ఏపీఎన్జీఓ అధికారుల సంఘం 21వ రాష్ట్ర మహాసభకు మండలంలోని పలు గ్రామాల సంఘసభ్యులు తరలివెళుతున్నట్లు సంఘసభ్యుడు కొండపల్లి సుదర్శనరాజు తెలిపారు. స్టేడియంలో నిర్వహించే సభకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటారని సభను జయప్రదం చేసేందుకు పలు గ్రామాలనుంచి సంఘ సభ్యులు, ఉద్యోగులు 70 మంది ఐదు వాహనాల్లో వెలుతున్నామన్నారు.

### ముస్లిం మైనార్టీలపై టీడీపీది కపట ప్రేమ

తాడేపల్లిరూరల్: ముస్లిం మైనార్టీలపై తెలుగుదేశం పార్టీ కపట ప్రేమ చూపిస్తోందని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. సోమవారం దుగ్గిరాలలోని ముర్తుజా నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నారా లోకేష్ యువగళం పాదయాత్రలో కొంతమంది ముస్లింలతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీలకు అన్యాయం జరుగుతోందని తాను ముస్లింలను ఉద్దరిస్తానంటూ, మైనార్టీల ఓట్ల కోసం కపట ప్రేమ చూపిస్తున్నారని విమర్శించారు.

### ఆశా కార్యకర్తలు, వలంటీర్లకు బియ్యం పంపిణీ



బండారుపల్లి(తాడికొండ): పేదలకు సాయం అందించడంలో సంతృప్తి ఉందని వైఎస్సార్ సీపీ నాయకుడు బెజ్జం సాయిప్రసాద్ అన్నారు. సోమవారం తాడికొండ మండలం బండారుపల్లి గ్రామంలో 35 మంది ఆశా వర్కర్లు, పారిశుద్ధ్య కార్మికులు, వలంటీర్లకు బియ్యం పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రజాసేవ చేస్తూ విధులు నిర్వహిస్తున్న పేదలను ఆదుకునేందుకు తనవంతు సాయం అందిస్తున్నానని, ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి తమవంతు సాయమందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### యానిమేటర్‌పై చర్యలు తీసుకోవాలని వినతి

ఫిరంగిపురం: మండలంలోని పొనుగుపాడు గ్రామంలో యానిమేటర్‌పై చర్యలు తీసుకోవాలంటూ గ్రామ రాజీవ్ సమాఖ్య సంఘ లీడర్లు, సభ్యులు ఈటీపీఆర్డీ నిర్మల లక్ష్మీకుమారికి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సదరు యానిమేటర్ డ్వాక్రా లోన్లకు సంబంధించి గ్రూపు సభ్యులనుంచి నగదు వసూలు చేసినట్లు తెలిపారు. అంతేకాక నగదు ఇవ్వకపోతే బ్యాంకులోన్లు మంజూరుచేసేందుకు ఇబ్బంది పెడుతున్నట్లు వెల్లడించారు. గ్రూపు పుస్తకాలు రాసేందుకు, ఫొటోలు తీసేందుకు సభ్యులనుంచి నగదు వసూలు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే సంబంధిత శాఖ ఏపీఎంకు తెలియజేశామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. దీనిని సంబంధిత శాఖ అధికారులకు అందజేస్తానని ఈటీపీఆర్డీ హామీ ఇచ్చారు.

# సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం సాకారం

- సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థకు దేశవ్యాప్త ప్రశంసలు
- రావెలలో నూతన సచివాలయం ప్రారంభోత్సవంలో జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



రావెలలో నూతన సచివాలయాన్ని ప్రారంభిస్తున్న కత్తెర హెనీక్రిస్టినా, బత్తుల బ్రహ్మానందరెడ్డి, కత్తెర సురేష్ కుమార్

రావెల(తాడికొండ): రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశంలోనే మంచి పేరు ప్రఖ్యాతలు సాధించి అందరి ప్రశంసలు పొందుతోందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా అన్నారు. సోమవారం తాడికొండ మండలం రావెల గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం ప్రారంభోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాకారం చేసేందుకు సీఎం వైఎస్ జగన్ ప్రవేశ పెట్టిన సచివాలయ వ్యవస్థ సత్ఫలితాలు సాధించి సామాన్యుడికి ప్రభుత్వ సేవలు చేరువ చేసిందనడంలో సందేహం లేదన్నారు. దీనికి అనుసంధానంగా వలంటీర్ వ్యవస్థ ప్రతి ఇంటికి అభివృద్ధి, సంక్షేమాన్ని చేరువ చేసి పేదల కలలు సాకారం చేస్తుందన్నారు. పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన జగనన్న నూరుశాతం హామీలు అమలు చేసి ఎన్నికలకు వెళుతున్నారని, ప్రజలు 175 సీట్లలో వైఎస్సార్ సీపీని గెలిపించి ప్రభంజనం సృష్టించబోతున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలతో పాటు ఏ పని కావాలన్నా జన్మభూమి కమిటీల సిఫార్సు అవసరమయ్యేదని, వారిని ప్రసన్నం చేసుకుంటేనే కార్యాలయంలో పనులు జరిగే పరిస్థితికి చెక్‌పెట్టి నేడు పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పాలన కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్‌తో కలిసి సచివాలయాన్ని ప్రారంభించిన అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించి బస్‌స్టాప్‌ను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. సర్పంచ్ రావెల శైలజ, మార్కెట్ యార్డు చైర్మన్ చిమటా పూర్ణచంద్రరావు, యార్డు మాజీ వైస్ చైర్మన్ భీమవరపు బ్రహ్మారెడ్డి, వైస్ ఎంపీపీ గణేష్ రెడ్డి, నిడుముక్కల సర్పంచ్ మాదాసు రత్నకుమారి, సొసైటీ చైర్మన్ భీమవరపు శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ అత్తోట దీప్తి, పలువురు ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి

మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి సీపీఎం నేతల వినతిపత్రం



ఎమ్మెల్యే ఆర్కేకి వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం రాజధాని డివిజన్ నాయకులు

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి, బాపనయ్య నగర్, ఎస్సీ కాలనీ ప్రాంత నివాస గృహ స్థలాలకు పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ సీపీఎం రాజధాని డివిజన్ కార్యవర్గ సభ్యుడు వల్లభాపురం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉండవల్లి, బాపనయ్య నగర్, ఎస్సీ కాలనీ ప్రాంతాల్లో సుమారు 300 మంది నిరుపేదల కుటుంబ నివాస స్థలాలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే ఆర్కేకు వినతి పత్రం సమర్పించామని స్పందించిన ఆయన వెంటనే తాడేపల్లి తహసీల్దార్ నాగిరెడ్డికి ఈ విషయమై చర్యలు చేపట్టవలసినదిగా కోరారని, ఇప్పటికే ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లామని ఈ సమస్యను వెంటనే పరిష్కరించడానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు. అదేవిధంగా ఇటీవల ఉండవల్లి అమరారెడ్డి నగర్‌లో నిర్మించిన రోడ్డు నిర్మాణ పనుల సందర్భంగా రెండువైపులా ఉన్న డ్రైన్ ప్రాంతాల వరకు నిర్మించకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్డును వెడల్పు చేస్తూ సైడ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టవలసినదిగా ఎమ్మెల్యే ఆర్కే ను కోరామని తెలిపారు. నాయకులు ఈమని రామారావు, సైకం వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా చరక మహర్షి జయంతి



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ పద్మావతి కల్యాణ మండపం వేదికగా భాస్కర్ ఆయుర్వేద హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్య పితామహుడు చరక మహర్షి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. సభకు డాక్టర్ గోకవరపు వెంకట కుమార్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, బొల్లేపల్లి సత్యనారాయణ పాల్గొని ప్రసంగించారు. అనంతరం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆస్పత్రి డాక్టర్ జి.వై.ఎస్. భాస్కర్, డాక్టర్ జి.లక్ష్మీ శ్రీవాణి రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు.

### ఇంట్లో చోరీ

గుంటూరు ఈస్ట్: ఇంట్లో చోరీపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. యతిరాజుల కాలనీ ఐదో లైనులో నివాసం ఉండే మేడసాని అంజమ్మ కుటుంబ సభ్యులతో కలసి ఈనెల 19న ఊరెళ్లి, తిరిగి 20న ఇంటికి చేరుకుంది. తాళాలు పగులగొట్టి ఉండటం గమనించి లోపలకు వెళ్లి పరిశీలించగా, బీరువాలోని రూ. లక్ష నగదు, రెండు బంగారం దిద్దులతో పాటు పలు గృహోపకరణాలు చోరీకి గురైనట్లు గుర్తించింది. ఈ మేరకు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఉరివేసుకుని వ్యక్తి బలవన్మరణం



పెదకాకాని: ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఉప్పలపాడు గ్రామంలో చోటు చేసుకుంది. మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన పెద్దిపాగ జోసఫ్ తంబి గుంటూరులోని వాటర్ సర్వీసింగ్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య సుశీల, ముగ్గురు సంతానం కలరు. కొంతకాలంగా జోసఫ్ చెడు వ్యసనాలకు బానిసగా మారాడు. అతిగా మద్యం సేవించడంతో పాటు పాన్ పరాగ్‌లు నిత్యం నములుతూనే ఉండేవాడు. దీంతో అప్పడప్పుడు తట్టుకోలేని విపరీతమైన కడుపునొప్పి వస్తూ ఉండేది. ఆదివారం రాత్రి కడుపునొప్పితో జోసఫ్ బాధపడుతూ ఉండగా భార్య సమీపంలో నివాసం ఉంటున్న అతని తండ్రి డేవిడ్‌కు తెలియజేసి, ఆసుపత్రికి తీసుకు వెళ్లేందుకు వారి ఇంటికి వెళ్లింది. తిరిగి వచ్చే సరికి జోసఫ్ తంబి(38) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. స్థానికుల సహకారంతో కిందకు దింపి, ఆసుపత్రికి తీసుకెళ్తుండగా.. మార్గమధ్యంలోనే అతను మృతి చెందాడు. మృతుని తండ్రి డేవిడ్‌రాజు ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

# మెరుగైన వైద్య సేవలు అందించాలి

ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు



మలేరియా సబ్ యూనిట్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ హనుమంతరావు

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు అన్నారు. నగరంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన మలేరియా సబ్ యూనిట్ కార్యాలయాన్ని సోమవారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన వైద్య సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఆయా అంటు వ్యాధులపై ప్రజలకు ముందస్తు జాగ్రత్తలను సూచించాలని కోరారు. ఈక్రమంలో మలేరియా సబ్ యూనిట్ కార్యాలయానికి మండల పరిషత్‌లోని గదిని కేటాయించి తమ ఇబ్బందులను తీర్చినందుకు వైద్య సిబ్బంది ఎమ్మెల్యే ఆర్కేకు, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యాధికారులు డాక్టర్ పి.అనూష, డాక్టర్ సత్యవతి, డాక్టర్ ప్రియాంక, మలేరియా అధికారి శ్రీమన్నారాయణ, సూపర్‌వైజర్లు సాగర్, సైదులు, జయలక్ష్మి, శ్రీనివాసు, నరసింహారావు, జాన్ ఫెన్నీ, నరసింహమూర్తి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాలువలకు సాగునీరు వెంటనే విడుదల చేయాలి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్‌పరిధిలోని ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్‌కు వెంటనే సాగునీటిని విడుదల చేయాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జొన్నా శివశంకరరావు అన్నారు. సోమవారం ఎంటీఎంసీ పరిధిలోని చిర్రావూరులో రైతు సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సాగునీరు విడుదల కాక పడుతున్న ఇబ్బందుల గురించి ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆయన మాట్లాడుతూ బకింగ్‌హామ్ కెనాల్ ఏర్పాటు సమయంలో కాలువ ప్రారంభం అయ్యే ప్రాంతంలో పంటపొలాలకు సాగునీరు అందించాలనే ఉద్దేశ్యంతో అప్పట్లో ఆంధ్రరత్న పంపింగ్‌స్కీమ్‌ను పాలకులు ఏర్పాటు చేశారని, కాలక్రమేణా ఆంధ్రరత్న పంపింగ్‌స్కీమ్ ఎత్తిపోతల పథకాన్ని రైతులకు అప్పగించారని, ఆ పంపింగ్ స్కీమ్ నిర్వహణ రైతులకు కష్టతరంగా మారిందని, ప్రభుత్వం, అధికారులు కలుగజేసుకుని వెంటనే ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్‌ను పునరుద్ధరించి తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లి, ప్రాతూరు, గుండిమెడ, చిర్రావూరు, రామచంద్రాపురం పంటపొలాలకు నీరు విడుదలచేయాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కాసినేడి బాజీ గంగాధరరావు, వీరిశెట్టి సాంబశివరావు, సీపీఎం నాయకులు పల్లె కృష్ణ, బత్తుల సంసోను, సీపీఐ నాయకులు ముసునూరు సుహాన్, ప్రాతూరు, గుండిమెడ, చిర్రావూరు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం



మేడికొండూరు సీఐ వాసును సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఫిరంగిపురం: శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేసిన సీఐ వాసు ఇండియన్ పోలీస్ మెడల్‌ను అందుకున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పేర్కొన్నారు. మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో సోమవారం శాంతి భద్రతల పరిరక్షణలో ఉత్తమ సేవలందించినందుకుగాను ఆగష్టు 15న ఇండియన్ పోలీస్ మెడల్‌ను అందుకున్న మేడికొండూరు సీఐ వాసుకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన విధంగా పోలీస్ స్టేషన్‌లో ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని సీఐ వాసు అమలు చేసి బాధితులకు న్యాయం చేశారని చెప్పారు. అందుచేతనే ప్రజల అభిమానాన్ని చూరగొన్నారన్నారు. అనంతరం సీఐ వాసును, ఇటీవల స్టేషన్‌లో ఎస్ఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చల్లా కిషోర్‌ను శాలువా, పూలమాలలు, బొకేలతో ఘనంగా సన్మానించారు. పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, పి.జేమ్స్ ఇన్నయ్య, కె.చిన్నప్పరెడ్డి, కె.సురేష్, బి.శ్రీనివాసరెడ్డి, జి.చంద్రం, పి.జోసఫ్, పి.వెంకట్రామిరెడ్డి, ఎం.సుధాకరరెడ్డి, వి.రాము, సీహెచ్ రామమోహన్‌రెడ్డి, డి.మెల్కియా, ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బాలికను వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదు

చేబ్రోలు: మైనర్ బాలికను ప్రేమ పేరుతో మోసగించి, వేధింపులకు గురిచేస్తున్న యువకుడిపై పొన్నూరు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పట్టణానికి చెందిన బాలికను జడవల్లి గ్రామానికి చెందిన యువకుడు మిక్కిలి రాఘవేంద్ర ప్రేమ పేరుతో అనేకసార్లు బలవంతంగా లైంగిక వేధింపులకు గురిచేశాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు రాఘవేంద్రపై అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ హసీమ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

### 'కళ్యం'లో జాతీయస్థాయి సాంకేతిక సదస్సు వాల్ పోస్టర్ల విడుదల

గుంటూరు రూరల్: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని ఉన్నతంగా రాణించాలని కళ్యం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో సెప్టెంబర్ 15, 16 తేదీలలో నిర్వహించనున్న జాతీయ స్థాయి విద్యార్థుల సాంకేతిక సదస్సు గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ మాట్లాడుతూ సంకల్ప్ 2024 పేరుతో జాతీయ స్థాయిలో సాంకేతిక సదస్సును నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి ఈ సదస్సుకు వేలాదిగా ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొంటారన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి మాట్లాడుతూ ఈ సదస్సులో సాంకేతిక, మేనేజ్‌మెంట్, క్రీడలు తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారన్నారు. ప్రాజెక్ట్ ఎక్స్‌పో, క్విజ్, హకతాన్, కోడ్ సిఫర్, పేపర్ ప్రజంటేషన్, ట్రెజరర్ హంట్, క్రీడల్లో క్రికెట్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, త్రోబాల్, టెన్నిస్, క్యారమ్స్, చెస్ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా విద్యార్థులకు రూ.4 లక్షలకు పైగా ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నామన్నారు.

# రోడ్డు నిర్మాణం త్వరితగతిన పూర్తిచేయాలి

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)



నవులూరులో తారు రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: కార్పొరేషన్ పరిధి నవులూరులో తారు రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అధికారులకు సూచించారు. సోమవారం ఆయన కార్పొరేషన్ పరిధి నవులూరులో జరుగుతున్న తారు రోడ్డు నిర్మాణ పనులను నగరపాలక సంస్థ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ సుమారు రూ.60 లక్షల నిధులతో నవులూరులోని మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నుంచి ముస్లిం స్మశాన వాటిక వరకు సుమారు 500 మీటర్ల పొడవుతో ఏడు మీటర్ల వెడల్పుతో తారురోడ్డును నిర్మించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే నవులూరులో గ్రావెల్ రహదారుల నిర్మాణాలతో పాటు పలు సీసీ రోడ్ల నిర్మాణాలను పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు ఎమ్మెల్యే ఆర్కేను కలసి వినతి పత్రాలు అందజేశారు. స్పందించిన ఆయన వెంటనే సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఎంతోకాలంగా నవులూరు మెయిన్ రోడ్డు సరిగా లేక రాకపోకలకు ఇబ్బందులు పడ్డామని, ఈ నేపథ్యంలో తారు రోడ్డు నిర్మాణం చేపట్టి తమ రాకపోకల ఇబ్బందులను తీర్చినందుకు స్థానిక ప్రజలు ఎమ్మెల్యే ఆర్కేకు ధన్యవాదాలు తెలిపారు. నగరపాలక సంస్థ ఏఈ కిషోర్, వైఎస్సార్ సీపీ నాయకులు ఈపూరి ఆదామ్, షేక్ హస్సన్, దొడ్డక కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు సభను జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం విధానాలు, ప్రస్తుత రాజకీయ పరిణామాలపై సీపీఎం ఆధ్వర్యంలో ఆగష్టు 25వ తేదీ గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించనున్న సభను జయప్రదం చేయాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం. రవి పిలుపునిచ్చారు. సోమవారం ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లిలోని సీపీఎం రాజధాని డివిజన్ కార్యాలయం వద్ద కరపత్రాల ఆవిష్కరణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పాశం రామారావు మాట్లాడుతూ గుంటూరులో జరిగే సభలో సీపీఎం పోలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు తదితరులు పాల్గొని ఉపన్యసిస్తారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందని, లౌకిక రాజ్యాంగం స్థానంలో మనువాద రాజ్యాంగాన్ని అమలు చేస్తోందని ఈ కుట్రలను సాగనివ్వకూడదని ఆయన అన్నారు. సీపీఎం రాజధాని డివిజన్ కార్యవర్గ సభ్యులు ఎం.భాగ్యరాజు, వల్లభాపురం వెంకటేశ్వరరావు, డివిజన్ నాయకులు ఈమని రామారావు, సీహెచ్ సుందరరావు, ఎస్కే ఎర్రపీరు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం

గడపగడపకు మన ప్రభుత్వంలో సమన్వయకర్త కత్తెర, ఏపీ ప్రభుత్వ సలహాదారు బత్తుల



ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహిస్తున్న కత్తెర సురేష్ కుమార్, బత్తుల బ్రహ్మానందరెడ్డి

వడ్డమాను(తాడికొండ): సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న పాలన దేశానికే ఆదర్శమని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్, ఏపీ ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం తుళ్లూరు మండలం వడ్డమాను గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వారు పాల్గొని ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలు అమలు తీరును అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరి సమస్యను తెలుసుకొని పాదయాత్రలో ఇచ్చిన హామీలు నూరుశాతం అమలు చేసిన సీఎం జగనన్న గత నాలుగున్నరేళ్లలో ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని, తను తన అనునాయులు దోచుకో దాచుకో అన్న పథకం అమలు చేసి ప్రజల నెత్తిన శఠగోపం పెట్టి పక్క రాష్ట్రాల్లోకి పారిపోయి దాక్కున్నారన్నారు. అమరావతి పేరుతో చంద్రబాబు, మార్గదర్శి చిట్‌ఫండ్‌లో రామోజీ చేసిన దోపిడీని వెలికితీస్తే వీరు ప్రజలను మోసం ఎలా చేశారు అనేది ప్రజలకు తెలుస్తుందన్నారు. పేదవాడికి సంక్షేమం అందించడమే లక్ష్యంగా 35 లక్షల ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు నిర్మించిన సీఎం వైఎస్ జగన్ చేసిన మేలు పేదలు తరతరాలు గుర్తుంచుకుంటారన్నారు. జగనన్న పాలన పది తరాలకు ఆదర్శంగా నిలువనుందని, మళ్లీ ఆయనను సీఎంగా గెలిపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో 175 కి 175 సీట్లు గెలిపించి మళ్లీ అధికారం కట్టబెట్టడం ఖాయమన్నారు. పార్టీ తుళ్ళూరు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్రా వెంకట శివారెడ్డి, తాడికొండ యార్డు చైర్మన్ చిమటా పూర్ణచంద్రరావు, పెదపరిమి సొసైటీ అధ్యక్షుడు మున్నంగి కోటిరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు చుండు వెంకటరెడ్డి, వివిధ విభాగాల నాయకులు కొప్పుల శేషగిరిరావు, శృంగారపాటి సందీప్, ఆరేపల్లి జోజి, నేలపాటి జోగేంద్ర, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పార్టీ కోసం పనిచేసే వారికి ఎల్లప్పుడూ గుర్తింపు

జేసీఎస్ కన్వీనర్ల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి

తాడికొండ: పార్టీ కోసం కష్టపడి పని చేసే వారికి గుర్తింపు ఉంటుందని, వారిని పార్టీ అక్కున చేర్చుకుంటుందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్, పార్టీ పరిశీలకులు బత్తుల బ్రహ్మానంద రెడ్డి చెప్పారు. తాడికొండలోని శ్రీ సాయిబాబా కల్యాణ మండపంలో సోమవారం జేసీఎస్ కన్వీనర్లకు జీవిత బీమా నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడారు. రానున్న రోజుల్లో జేసీఎస్ కన్వీనర్లది కీలకపాత్ర కానున్నట్లు చెప్పారు. వారి పనితీరును గుర్తుపెట్టుకుని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ. 10 లక్షల వరకు బీమా సౌకర్యాన్ని కల్పిస్తోందన్నారు. గత ప్రభుత్వం పార్టీ నాయకుల్ని, కార్యకర్తలని వాడుకుని వదిలేసిందని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏ ఒక్కరిని కూడా వదిలిపెట్టదని వారికి తగిన న్యాయం చేస్తోందని వెల్లడించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పదవి చేపట్టిన నాటి నుంచి ఎల్లో మీడియా అసత్య ప్రచారాలు చేస్తోందని మండిపడ్డారు. ఏ మంచి కార్యక్రమం తలపెట్టినా అడ్డగోలు రాతలు రాస్తూ దుష్ప్రచారం చేస్తున్నారన్నారని ఆరోపించారు. అయినప్పటికీ ప్రజలు నిజాలు గ్రహిస్తున్నారన్నారు. అందుకు నిదర్శనం ఇప్పుడు జరిగిన పంచాయతీ ఎన్నికల ఫలితాలేనన్నారు. ప్రతి గడపలోను సంక్షేమ వెల్లివిరుస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 33 లక్షల ఇళ్ల స్థలాలు ఇస్తే, రాజధానిలో 51 వేల మంది పేదలకి ఇళ్ల స్థలాలు కేటాయించారన్నారు. ఇది చూసి ఓర్వలేక టీడీపీ నేతలు కోర్టులకు వెళుతున్నారని విమర్శించారు. పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తే మురికివాడలుగా మారుతాయి అని అనటం వెనుక వారికి పేదల పట్ల ఉన్న చులకనభావం ఏంటో అర్థం అవుతోందన్నారు. పేదలు అక్కడ నివసించకూడదని వివక్షత చూపుతున్నారని తెలిపారు. ఇటువంటి పార్టీలు గెలిస్తే పేదల భవిష్యత్తు ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవాలన్నారు. బ్రిటిష్ వారిలా విభజించు పాలించు సిద్ధాంతాన్ని తెలుగుదేశం పార్టీ అవలంభిస్తుందన్నారు. టీడీపీ హయాంలో ఏ పథకాన్ని సక్రమంగా అమలు చేయలేదని, ఏ ఒక్కరికి సెంటు భూమి కూడా ఇవ్వలేదని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో జేసీఎస్ కన్వీనర్లు కీలకపాత్ర వహించాలన్నారు. పలువురు జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

# 26న 'పంచుకుందాం రా' పుస్తకంపై చర్చా వేదిక

తెనాలి: 'ఆహ్వానం లక్ష్మి' సంస్మరణలో భాగంగా ఈనెల 26న కవి, సామాజిక ఉద్యమాల కార్యకర్త కృపాకర్ మాదిగ కవిత్వం 'పంచుకుందాం రా' పుస్తకంపై చర్చా వేదిక జరగనుంది. పట్టణానికి చెందిన సాహితీ సాంస్కృతిక వేదిక 'భిన్నస్వరాలు' ఆధ్వర్యంలో ఆరోజు సాయంత్రం 6 గంటలకు కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఏర్పాటయే సభకు కె.వి. రాఘవరెడ్డి సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. దళిత ఓపెన్ యూనివర్సిటీ ఆఫ్ ఇండియా వైస్ చాన్సలర్ ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి ప్రారంభించే చర్చలో ప్రముఖ సాహితీ విమర్శకుడు గుంటూరు లక్ష్మీనరసయ్య, ఆచార్య పొన్నెకంటి రత్నాకర్, రచయిత్రి గంగవరపు సునీత, కవి కృపాకర్ మాదిగ పాల్గొంటారు. గత ఏప్రిల్ 17న మృతి చెందిన 'ఆహ్వానం లక్ష్మి'కి నివాళిగా ఏడాదిపాటు ప్రతినెలా ఒక మంచి పుస్తకంపై చర్చను జరపాలని భిన్నస్వరాలు తీర్మానించుకుంది. ఆ ప్రకారం నెలనెలా చర్చావేదికను నిర్వహిస్తోన్న విషయం తెలిసిందే.